
# సైబర్ ముఠాల ఆట కట్టిస్తాం

## దర్యాప్తు శిక్షణ శిబిరంలో సీపీ తరుణ్‌జోషి

**నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే:** అమాయక ప్రజల్ని మాయమాటలతో మోసగిస్తున్న సైబర్ ముఠాల ఆటలు కట్టిస్తామని రాచకొండ సీపీ తరుణ్‌జోషి అన్నారు. నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం సైబర్ నేరాలకు సంబంధించిన కేసుల నమోదు, దర్యాప్తులో పాటించాల్సిన పద్ధతులపై ఠాణాల ఇన్‌స్పెక్టర్లకు, ఇతర అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి 7గంటల వరకు జరిగిన కార్యక్రమంలో సీపీ మాట్లాడారు. సైబర్ నేరాల దర్యాప్తులో యూరప్ దేశాల పోలీసు వ్యవస్థ కంటే భారత పోలీసులు ఎక్కువ సమర్థవంతంగా పని చేస్తున్నారని అన్నారు. భవిష్యత్తులో అంతర్జాలం ద్వారానే నేరాలు అధికమవుతాయని, దేశాల మధ్య జరిగే యుద్ధాలు సైబర్ దాడుల ద్వారానే జరుగుతాయన్నారు. శిక్షణలో పాల్గొన్న సిబ్బంది ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాల ద్వారా నేషనల్ సైబర్ ఫోరెన్సిక్ లేబొరేటరీ సహాయం తీసుకోవచ్చన్నారు. సైబర్ భద్రతను పెంచడానికి నేషనల్ సైబర్ సెక్యూరిటీ పాలసీ ప్రకారం చేపడుతున్న చర్యలను వివరించారు. కేంద్రం గతేడాది తీసుకొచ్చిన డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్-2023 గురించి వివరించారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, క్లౌడ్, డాటా, నెట్‌వర్క్ సెక్యూరిటీలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలకు అంతర్జాలంలో ఎదురౌతున్న అనేక రకాల వేధింపులు, మోసాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. . సైబర్ టెర్రరిజం ద్వారా దేశ అంతర్గత భద్రతకు ఎదురవుతున్న సవాళ్లను, ఎదుర్కోవాల్సిన పద్ధతులను, అవలంబించాల్సిన విధానాలపై సంపూర్ణ అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో డీసీపీ చంద్రమోహన్, ఏసీపీలు వెంకటేశం, నరేందర్‌గౌడ్, రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ అశీష్‌రెడ్డి, న్యాయవాది అశ్విన్‌రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.





కార్యక్రమానికి హాజరైన పోలీసు అధికారులు ● మాట్లాడుతున్న సీపీ

# సైబర్ నేరాల విచారణ వేగవంతం





## ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: కమిషనర్ తరుణ్ జోషి

**సృజనక్రాంతి/రంగారెడ్డి :** సైబర్ నేరాల దర్యాప్తు, నమోదు చేయవలసిన సెక్షన్లు మరియు విచారణ పద్ధతుల మీద నేరేడ్ మెట్ లోని కమిషనర్ కార్యాలయంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలోని స్టేషన్ హౌస్ అధికారులు, ఆయా స్టేషన్ల సైబర్ నేరాల దర్యాప్తు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సైబర్ నేరాల నమోదులో పాటించవలసిన వివిధ సెక్షన్లకు సంబంధించిన నిబంధనల మీద సంపూర్ణ అవగాహన కల్పించడం జరిగింది. సైబర్ సేఫ్టీ ఎకోసిస్టమ్ లో భాగంగా ఇన్ఫ్రాస్ట్రక్చర్ సెక్యూరిటీ, క్లౌడ్ సెక్యూరిటీ, డేటా సెక్యూరిటీ, నెట్వర్క్ సెక్యూరిటీ వంటి వాటి మీద అవగాహన కల్పించడం జరిగింది. మహిళలకు అంతర్జాలంలో ఎదురవుతున్న వివిధ రకాల వేదింపులు, సామాజిక మాధ్యమాలలో జరిగే మోసాల వంటి సున్నితమైన కేసుల విచారణలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించడం జరిగింది. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల డేటా చౌర్యం, లేదా ప్రజల వ్యక్తిగత మరియు సున్నితమైన డేటా చౌర్యం వంటి కేసుల నమోదు సెక్షన్లు, మరియు విచారణ పద్ధతుల గురించి వివరించారు. స్వదేశీ, విదేశీ హ్యాకర్ల సైబర్ టెర్రరిజం ద్వారా దేశ అంతర్గత భద్రతకు ఎదురవుతున్న సవాళ్ళు, దాన్ని ఎదుర్కోవాల్సిన పద్ధతులు, సైబర్ టెర్రరిజం వంటి నేరాలకు పాల్పడిన నేరస్తుల కేసుల విచారణలో అవలంబించవలసిన విధానాల మీద సంపూర్ణ అవగాహన కల్పించడం జరిగింది. డీప్ ఫేక్ వీడియోలు, బ్యాంక్ లావాదేవీల మోసాలను త్వరిత గతిన విచారణ చేయడంలో పాటించవలసిన విధానాలు మరియు సోషల్ మీడియా సంబంధిత నేరాల విచారణలో పాటించవలసిన స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ మీద సిబ్బందికి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీ తరుణ్ జోషి మాట్లాడుతూ.. సైబర్ నేరాల దర్యాప్తులో ఎంతో అభివృద్ధి చెందిన యూరప్ దేశాల పోలీసు వ్యవస్థ కంటే భారతదేశ పోలీసులు ఎక్కువ సమర్ధవంతంగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో సమాజంలో నేరాలు ప్రధానంగా అంతర్జాలం ఆధారంగానే జరుగుతాయని, వివిధ దేశాల మధ్య జరిగే యుద్ధాలు కూడా సైబర్ దాడుల ద్వారానే జరుగుతాయని పేర్కొన్నారు. సైబర్ నేరాల విచారణ వేగవంతం చేయడానికి ఉపయోగపడేలా త్వరలోనే సిబ్బందికి మరిన్ని శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సైబర్ నేరాల దర్యాప్తు అధికారులు ఆఫ్లైన్ మరియు ఆన్లైన్ విధానాల ద్వారా నేషనల్ సైబర్ ఫోరెన్సిక్ లేబొరేటరీ సహాయం తీసుకోవచ్చని తెలిపారు. దేశ సైబర్ భద్రతను పెంచడానికి నేషనల్ సైబర్ సెక్యూరిటీ పాలసీ ప్రకారం చేపడుతున్న చర్యల గురించి వివరించారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు మరియు దర్యాప్తు చేయడంలో లా ఎన్ఫోర్స్ మెంట్ ఏజెన్సీలను బలోపేతం చేయడంలో ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ పోషిస్తున్న పాత్రను గుర్తు చేశారు. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా సాధారణ ప్రజలు ముఖ్యంగా మహిళలు మరియు పిల్లలు తమకు ఎదురయ్యే సైబర్ నేరాలను గురించి ఆన్లైన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. దేశ ప్రజలకు సైబర్ భద్రతను అందించడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం గత ఏడాది తీసుకువచ్చిన డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్-2023 గురించి కమిషనర్ వివరించారు. నేటి ఆధునిక సాంకేతిక యుగంలో వివిధ రకాల అవసరాలకు ఎన్నో రకాల సాంకేతిక పరికరాలు ఉపయోగించడం జరుగుతోందని, వాటి వల్ల పలు రకాల మార్గాలలో జరిగే నేరాల వల్ల ఎంతో మంది బాధితులు నష్టపోతున్నారని కమిషనర్ తెలిపారు. డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డుల వివరాలను సురక్షితంగా ఉంచుకునేలా, సరైన సైబర్ సెక్యూరిటీ లేని ప్రదేశాల్లో అటువంటి కార్డులు వీలైనంత వరకు ఉపయోగించకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ప్రజలలో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని, ఆర్థిక సంబధిత నేరాల దర్యాప్తులో తీసుకోవలసిన చట్టపరమైన జాగ్రత్తల గురించి పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని అధికారులను ఆదేశించారు. లాటరీలో డబ్బు గెలుచుకున్నారని వచ్చే మోసపూరిత, ఫోన్ కాల్స్ మరియు మెసేజ్ ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వీలైనంత వరకు సురక్షితం కాని పబ్లిక్ వైఫైలను ఉపయోగించి ఎటువంటి డిజిటల్ చెల్లింపులూ చేయకూడదని సూచించారు. యువత సోషల్ మీడియాలో అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా వ్యవహరించాలని కమిషనర్ సూచించారు. అంతర్జాలంలో ఎటువంటి వేధింపులు ఎదురైనా తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని, అవసరమైన పక్షంలో పోలీసులు బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతారని తెలిపారు. సైబర్ క్రైమ్ పోలీస్ టోల్ ఫ్రీ నంబర్ 1930 ను సంప్రదించడం ద్వారా సైబర్ నేరాల మీద ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీ చంద్ర మోహన్ సైబర్ క్రైమ్స్, ఏసిపి వెంకటేశం, ఏసిపి నరేందర్ గౌడ్, ఏసిపి రమేష్ కుమార్, ఇన్స్పెక్టర్ ఆశిష్ రెడ్డి, అడ్వకేట్ అశ్విన్ రెడ్డి, ఇతర అధికారులు, వివిధ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.



# సైబర్‌నేరాల దర్యాప్తులో..

# భారత్ పోలీస్ వ్యవస్థ భేష్

## రాచకొండ పోలీసుల శిక్షణలో సీపీ తరుణ్ జోషి

సిటీబ్యూరో, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): సైబర్‌నేరాల దర్యాప్తులో ఎంతో అభివృద్ధి చెందిన యూరఫ్ దేశాల పోలీస్ వ్యవస్థ కంటే భారతదేశ పోలీసులు ఎక్కువ సమర్థవంతంగా పనిచేస్తున్నారని రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి అన్నారు. సైబర్‌నేరాల దర్యాప్తు, నమోదు చేయాల్సిన సెక్షన్లు, విచారణ పద్ధతులపై నేరేడ్‌మెట్‌లోని పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో స్టేషన్ హౌస్ అధికారులు, సైబర్ నేరాల దర్యాప్తు సిబ్బందికి సోమవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్‌నేరాలకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం సీపీ తరుణ్ జోషి మాట్లాడుతూ.. భవిష్యత్తులో ప్రధానంగా నేరాలు ఇంటర్‌నెట్ ఆధారంగానే జరుగుతాయని, వివిధ దేశాల మధ్య జరిగే యుద్ధాలు కూడా సైబర్‌దాడుల ద్వారానే జరుగుతాయన్నారు. సైబర్‌నేరాల విచారణ వేగవంతం చేయడానికి కావాల్సిన మెలుకువలు, అవగాహన కల్పించేందుకు మరిన్ని శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సైబర్‌నేరాల దర్యాప్తు అధికారులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నేషనల్ సైబర్ ఫోరెన్సిక్ లేబొరేటరీ సహాయాన్ని తీసుకోవచ్చని సూచించారు. సైబర్ భద్రతను పెంచడానికి నేషనల్ సైబర్ సెక్యూరిటీ పాలసీ ప్రకారం చేపడుతున్న చర్యల గురించి వివరించారు. సైబర్‌నేరాల దర్యాప్తునకు సంబంధించిన ఏజెన్సీలను మరింత బలోపేతం చేసేందుకు సైబర్‌క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్, 1930కు సైబర్ బాధితులు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. దేశ ప్రజలకు సైబర్ భద్రత అందించడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం గత ఏడాది తీసుకొచ్చిన డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్- 2023 గురించి సీపీ వివరించారు. ఈ కార్యక్రమంలో సైబర్‌క్రైమ్స్ డీసీపీ చంద్రమోహన్, ఏసీపీలు వెంకటేశం, నరేందర్‌గౌడ్, రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.